"మహదేవ్ ప్రాణానికేం భయంలేదని చెబుతున్నా మరేదో విషయం ఆయన చెప్పేలోగా చీఫ్‌నుంచి ఆయనకు పిలుపొచ్చింది. ఇంతలో మీరొచ్చారు ..... " జరిగింది వివరించాడు అభిరాం. వరప్రసాదం మౌనంగా వుండిపోయాడు. దీర్ఘాలోచనతో అతని భృకుటి ముడిపడింది.

ఇంతలో డాక్టర్ వస్తున్నట్లు బూట్ల శబ్దం విన్పించింది. అభిరాంకి ఆ శబ్దం విన్పించగానే తన గుండె రెట్టింపు వేగంతో కొట్టుకోవటం తెలుస్తోంది.

వరప్రసాదం కూడా ఆత్రుతగా చూడసాగాడు. డాక్టర్ వచ్చి తన సీట్లో కూర్చున్నాడు.

"మీరుకూడా వచ్చేశారా?" చిరునవ్వుతో పలకరించాడు వరప్రసాదాన్ని.

మౌనంగా తలూపాడతను.

"మహదేవ్ హెల్త్ కండిషన్ బాగానే వుంది" వరప్రసాదం వంక తిరిగి అన్నాడు డాక్టర్.

అభిరాంకి విసుగూ, కోపం వచ్చాయి.

చెప్పాలనుకున్నదేదో చెప్పెయెచ్చుకదా! ఎందుకు దాస్తున్నాడు? అనిపించిందతనికి.

కొన్ని క్షణాలు మౌనం తర్వాత ఇలా అన్నాడు డాక్టర్-

"మన మెదడు వెయ్యి కంప్యూటర్ల కన్నా గొప్పది. ఎన్నో కణాల కూర్పుతో, సెల్స్‌తో, ప్రపంచంలోనే అద్భుతమైనవాటి అన్నిటికంటే మహాద్భుతమైనది. మనిషి మెదడులో జ్ఞాపకశక్తికీ, తెలివితేటలకి సంబంధించి ఎన్నో భాగాలూ, జన్యువులూ వుంటాయి. వీటిలో ముఖ్యమైనవి రెండు. అందులో మొదటిది "హిప్పోక్యాంపస్, రెండవది సెరెబ్రల్ కార్టెక్స్ ..... '

డాక్టరెందుకా విషయాలు చెబుతున్నాడో అర్థంకాలేదు వాళ్ళకి. డాక్టర్ మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టాడు. "అలాగే మెదడులోని ఫ్రంట్ లోబ్ వ్యక్తిత్వాన్నీ, ఎమోషన్స్‌నీ, నిర్ణయాలు తీసుకోవటాన్నీ అదుపు చేస్తుంటుంది. పరియెటల్ లోబ్ భాషనీ, తర్క విజ్ఞానాన్నీ కలుగజేస్తుంది. మనిషి మెదడులోని సెల్ఫ్ సమాచారాన్ని ప్రింట్ చేసుకుంటాయి.

వృద్ధాప్యం ముంచుకొస్తున్న కొలదీ సెల్స్ చచ్చిపోతుంటాయ్. సెల్స్‌లో ఒకదానికీ మరొకదానికీ ఇంటర్ కనెక్షన్స్ వుంటాయి. అంటే చచ్చిపోయిన సెల్‌లో నిక్షిప్తమైన సమాచారం పూర్తిగా కానీ, కొంతగానీ వేరొక సెల్‌లో వుండవచ్చు.

సాధారణంగా మనం మన మెదడు సామర్థ్యంలోని కేవలం మూడు నుంచి నాలుగుశాతం మాత్రమే ఉపయోగించుకుంటున్నాం. మెదడు గురించిన పనితనం డాక్టర్లకి తెలిసింది చాలా తక్కువ మాత్రమే.

విషపదార్థాల మూలంగా మెదడు కణజాలం దెబ్బతినకుండా కాపాడే గుణం ఈస్ట్రోజెన్‌కుంది. గర్భాశయంలో వున్న పిండం మెదడు అభివృద్ధి చెందడంతో ఈస్ట్రోజెన్ ఉపయోగపడుతుందని ఇంతవరకూ అనుకునే వారు. అంతేకాదు పెద్దవారిలో కూడా

జ్ఞాపకశక్తిని పెంపొందించగల సామర్థ్యం ఈస్ట్రోజెన్‌కు వుందని శాస్త్రవేత్తలు పరిశోధనల్లో తెలుసుకున్నారు.

అయితే జ్ఞాపకశక్తి పెరగడానికి ఎక్కువ మోతాదులో ఈస్ట్రోజెన్ తీసుకుంటే స్త్రీలలో అయితే క్యాన్సర్ వ్యాధి, మగవాళ్ళలో అయితే స్త్రీ లక్షణాలు పెరిగే ప్రమాదం కూడా వుందని గమనించిన పరిశోధకులు ఈస్ట్రోజెన్ ప్రభావం కేవలం మెదడుపైనే వుండే విధంగా తక్కువ మోతాదులో దాన్ని మెదడుకి అందించాలని పేర్కొంటున్నారు ..... " ఆగాడతను విరామం కోసమన్నట్లు.

డాక్టర్ ఎందుకు మెదడు గురించి మాట్లాడుతున్నాడో అర్థంకాక మళ్ళీ మనసులో గుంజాటనపడ్డారు అభిరాం, వరప్రసాదంలిద్దరూ.

డాక్టర్ చెప్పటం మొదలుపెట్టాడు-- "కొన్ని కేసుల్లో భయం, జుగుప్స కలిగించే సంఘటనలు, విపరీతమైన బాధవల్ల మన మెదడులోని సెల్స్ నిద్రలోకి వెళ్ళిపోతాయి. అప్పుడు ఏ విషయాల వల్లనైతే మనిషి మెదడులోని సెల్స్ నిద్రలోకి వెళ్ళిపోయాయో తెలుసుకుని ఆ విషయాలని చర్చిస్తూ ఆ సెల్స్‌ని తిరిగి రివైవ్ చేయవచ్చు. ఉదాహరణకు మనం రోడ్డుమీద వెళుతుండగా చూసిన అతి భయంకరమైన మర్డర్, ఏక్సిడెంటులు వంటి సంఘటనలు. ఆ సంఘటన చూపిన అందరికీ బ్రెయిన్ సెల్స్ నిద్రలోకి వెళ్ళిపోయి జ్ఞాపకశక్తి పోవడం వంటివి జరగకపోవచ్చు.

అరుదుగా అలా ఎవరికయినా, జరిగితే అప్పుడా విధంగా బ్రెయిన్ సెల్స్ నిద్రపోయి జ్ఞాపకశక్తిపోయిన వ్యక్తికి వచ్చిన వ్యాధిని 'అమ్నీసియా' అంటారు. చాలా కారణాలవల్ల మెదడులోని ఎలక్ట్రికల్ యాక్టివిటీలో పెర్‌ఫెక్షన్ దెబ్బతింటుంది. అఫ్‌కోర్స్ వాటిని సరిచేయవచ్చునుకోండి" అని అతను అంటుండగా డాక్టర్ టేబిల్‌మీద ఫోన్ మోగింది.

"ఏదో జరిగింది! సమ్‌థింగ్ ఈజ్ రాంగ్" మనసులో అనుకున్నాడు అభిరాం.

"హలో ..... " అన్నాడతను.

" ..... "

"ఓ అరగంటలో వస్తాను."

" ..... "

"కొంచెం పనుంది ..... "

" ..... "

"ఎవరెవరు వచ్చారు?"

" ..... "

"పృధ్వీ కూడానా? అతనికోసారి ఫోనివ్వు."

" ..... "

"హాయ్ పృధ్వీ! బాగా చదువుతున్నావా?"

" ..... "

"ఓ అరగంటలో అక్కడుంటాను" అని ఫోన్ క్రెడిల్‌చేసి తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు.

" ..... ఒక్కోసారి కొన్ని ఏక్సిడెంట్స్‌లో తలకి బలమైన దెబ్బలు తగలడంవల్ల జ్ఞాపకశక్తి పోతుంది. తనేం చేస్తున్నాడో, తనెవరో కూడా తెలియదు వాళ్ళకి. తమ పేరు, వృత్తి, వయసు, తల్లిదండ్రుల్నీ, భార్యా పిల్లల్ని కూడా మరచిపోతారు.

తామున్న ప్రదేశం ఏమిటో, అదే దేశమో కూడా గుర్తుండదు. దురదృష్టవశాత్తు దీనికి మందు కూడా లేదు.

సినిమాల్లో చూపించినట్టు ఎక్కడైతే ముందు దెబ్బ తగిలిందో అక్కడే మళ్ళీ తగిలి తన పూర్వ స్మృతి రావాలే తప్ప- ఇదీ నూటికో, కోటికో ఒక్కరికే అలా జరుగుతుంది."

అప్పుడు ..... అతడు స్ఫురించింది అభిరాంకి! "మహదేవ్ తలకి తగిలిన బలమైన దెబ్బవల్ల అతనికి జ్ఞాపకశక్తి పోయిందా? అది డైరెక్టుగా చెప్పేస్తే తాము ఖంగారు పడతామని ఇంత ఇన్‌డైరెక్టుగా చెబుతున్నాడా డాక్టర్" అనుకున్నాడతను.

అలా అనుకోగానే చల్లని మంచు గదిలోకి తనని ఎవరో తోసేసినట్లు గజగజలాడిందతని శరీరం .....

* * * * *

సమయం ఉదయం ఎనిమిది గంటలు ..... మనస్విని హాస్టల్‌లోని గదిలో కిటికీగుండా సూర్య కిరణాలు పడుతున్నాయి. ఆమె అప్పటికే కడిగిన ముత్యంలా తయారయింది.

అద్దం ముందుకు నడిచి బొట్టుపెట్టుకుంది. దాంతో ఆ బొట్టుకే అందం వచ్చింది. నల్లపూసలున్న తెల్ల కాటన్ శారీలో ఎల్లోరా శిల్పంలా వుందామె.

రూమ్‌కి తాళంవేసి బయటపడింది. నిన్నటి దిగులూ, ఆవేదన ఆమెలో ఇప్పుడు మచ్చుకైనా లేవు. వాటినుంచి ఆమెని తప్పించిన ఘనత మేడం ప్రమీలాదేవిదే. ఆ విషయం గుర్తొచ్చి వెళ్ళే ముందు మేడం గదికి నడిచి -- "ఆఫీసుకి వెళ్ళొస్తాను మేడం" అంది మనస్విని!

"మంచిదమ్మా" ఏదో మేగజైన్ చదువుతున్న మేడం తృప్తిగా చూసి అంది.

హాస్టల్‌నుంచి బయటపడి బస్టాప్‌వైపు నడుస్తోందామె. "మహదేవ్ తమ సంగతి వాళ్ళమ్మకి చెప్పే వుంటారు. ఆమె అభ్యంతరం చెప్పదనీ తన ఇష్టమే ఆమె ఇష్టమని అతను చెప్పాడు. కాబట్టి వెంటనే అతను తిరిగొచ్చి ఇద్దరం దైవసన్నిధిలో పెళ్ళి చేసుకుంటా"నన్న ఊహలో ఆమె మోములో సిగ్గు దొంతరలు నాట్యమాడాయి.

ఆమె కళ్ళు చుట్టుపక్కల పరిసరాలని గమనిస్తున్నాయి. ఎక్కడైనా మహదేవ్ కన్పిస్తాడని. బస్టాప్‌కి చేరుకున్నంతవరకూ ఆమె కళ్ళు చంద్రుని కోసం వెదుకుతున్న చకోరంలా అతన్ని వెదుకుతూనే వున్నాయి. అయినా అతను ఎక్కడా కన్పించలేదు.

“బహుశా ఊర్నించి ఇంకా రాలేదేమో” అనుకుందామె. ఇంతలో ఆమె ఎక్కవలసిన బస్సు వచ్చింది. ఆమె బస్సు ఎక్కుతూ మళ్ళీ పరిసరాలని గమనించింది. మహదేవ్ జాడలేదు. రోజూ చూసే ఆమెని కండక్టర్ చిరునవ్వుతో పలకరించాడేకానీ టిక్కెట్ కానీ బస్‌పాస్‌కానీ అడగలేదు. బస్ ముందుకు సాగిపోతోంది. ఆమె రోడ్డుమీదకి దృష్టి సారించింది.

ఏ రోడ్డు మలుపులోనుంచయినా తన వలపుల చెలికాడు హఠాత్తుగా కనులముందు ప్రత్యక్షమౌతాడనుకున్న ఆమె నిరాశే అయింది.

----------------------------------------------

“ప్లీజ్ డాక్టర్! మహదేవ్‌కేమయిందో సూటిగా చెప్పండి. ఉపోద్ఘాతాలొద్దు” వణుకుతున్న స్వరంతో అన్నాడు అభిరాం.

వరప్రసాదం అతన్ని వారిస్తున్నట్టు భుజం తట్టాడు.

అప్పుడు మహదేవ్ పరిస్థితి గురించి అసలు విషయం చెబుతున్నట్టు అభిరాం వంక సూటిగా చూస్తూ అన్నాడు డాక్టర్.

“మీ ఫ్రెండ్ తలకి తగిలిన గాయంవల్ల మెదడుకేమయినా డామేజ్ అయిందేమో అని బ్రెయిన్ స్కానింగ్ తీశాం. అందులో ఎలక్ట్రికల్ యాక్టివిటీస్ పెర్‌ఫెక్షన్‌మీద మాక్కొంచెం అనుమానం వచ్చింది” అంటూ డ్రాయర్‌లోంచి స్కానింగ్ రిపోర్టు బయటికి తీశాడు.

గబుక్కున దాన్ని అందుకుని చూశాడు అభిరాం. ఏవో పిచ్చిగీతల్లా ఉన్నాయని. ఏమీ అర్థంకాలేదతనికి. వరప్రసాదం కూడా వాటిని చూశాడు.

“అవి మీకు అర్థంకావు” అంటూ ఆ రిపోర్ట్‌ని తిరిగి యథాస్థానంలో వుంచేశాడు.

“అయినా ఫర్వాలేదు ..... ఎలక్ట్రికల్ యాక్టివిటీస్‌లోని లోపాలు కరెక్టు చెయ్యొచ్చు ..... ఏదేమయినా అతనికి స్పృహ వస్తే కానీ ఏ విషయం నిర్ధారణ కాదు. ఒకవేళ అలా జరిగినా మీరు బెంబేలు పడకూడదనే మీకింత వివరంగా చెప్పాను ..... ” అన్నాడు.

అభిరాంకి మహదేవ్ కోలుకుంటున్నాడనే ఆనందం ఆవిరైపోయి, అతను తన జ్ఞాపకశక్తిని పోగొట్టుకోబోతున్నాడామో అన్న ఆదుర్దా అధికమైంది. నిస్త్రాణంగా సీటు వెనక్కి వాలిపోయాడు.

వరప్రసాదం చేష్టలుడిగి చూస్తున్నాడు.

“మహదేవ్‌కి ఎప్పుడు స్పృహ రావచ్చు?” నూతిలోంచి వచ్చినట్లు వుంది అభిరాం స్వరం.

“మోస్ట్‌లీ ఇంకో ఫోర్ అవర్స్” అన్నాడు డాక్టర్.

అప్పుడు సమయం ఉదయం తొమ్మిదవుతోంది. ‘అంటే మధ్యాహ్నం ఒంటిగంటకి తెలుస్తుంది మహదేవ్ విషయం’ అనుకుని లేచి నిలబడ్డాడు అభిరాం.

వరప్రసాదం కూడా లేచాడు.

ఇద్దరూ బయటికి నడిచారు. అభిరాంలో శక్తంతా ఎవరో తోడేసినట్లు నడవలేక నడుస్తున్నాడు.

ఇద్దరూ విజిటర్స్‌కోసం కేటాయించిన సోఫాలో రెక్కలు తెగిన పక్షుల్లా కూలబడిపోయారు. ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవటంలేదు. సమయం మెల్లగా సాగుతూ ముందుకు నడుస్తోంది.

* * * * *

ఆ రోజు ఆఫీసులో వర్క్ పెద్దగా లేకపోవటంతో మనస్విని చుట్టూ ఆలోచనా మేఘాలు ముసురుకుంటున్నాయి. కనులు తెరుచుకునే కలలు కంటున్నట్టు పరధ్యానంలో పడిపోయింది. యోగుల ధ్యానం కన్పించని భగవంతుడికోసమైతే ..... యువతీ యువకుల పరధ్యానం కనిపించీ కనపడకుండా అల్లరిగా నవ్వే తమ ప్రియతముల కోసమే!

ఎలా వున్నావ్ మహదేవ్.... ?

అయ్యో! ఎందుకా నవ్వు మార్దవంగా! నిన్నంతగా దిగులు నన్నెందుకు ఆవరించుకుందో?

బహుశా నీ సామీప్యానికి దూరమయ్యాననా? కాదు కాదు ..... అలా అయితే నిన్ను విడిచి పక్షంరోజులు సముద్రతీరాలు, భీమిలీ అందాలు తిలకిస్తుండగా మామూలుగానే ఎందుకుంటాను?

ఎందుకో తెలియదు నిన్న భలే దిగులేసింది. భలే ఏమిటీ ..... చెడ్డ దిగులేసింది. దిగులును దిగంతాల ఆవలకు తోలేందుకు నువ్వు లేవుగా .....

కానీ మా మేడం నాకా సమయంలో తోడయి దిగులు బాధతో ముకుళించుకుపోయిన మనసుని మాటల చేతలతో మళ్ళీ ఛెంగు ఛెంగున గెంతి గుబురు పొదలలో దోబూచులాడే లేడిపిల్లల్లా మలిచారు. నేనే కాదు ఈ విషయంలో నా తరపున నువ్వూ థ్యాంక్స్ చెప్పాలి. నిన్ను మా గూర్ఖా ఆపేస్తాడా, ఎందుకాపేస్తాడు? నువ్వు నువ్వుగా రావుగా. నువ్వు నేనయి నేను నువ్వయి నువ్వూ నేనూ కలిసే వస్తాంగా. ఆ పనిమీదే పయనమై మళ్ళీ మరిచిపోయావా పప్పు సుద్దా .....

ఇంకా ఏం చేస్తున్నావ్ అక్కడ? నువ్వు లేక నీ జ్ఞాపకాల స్వరాలతో సమానంగా గొంతు కలిపి సేద తీరుతున్నాను. ఎందుకింత ఆలస్యం చేస్తున్నావ్? 'ఎడబాటు పెంచును మరింత ప్రియత్వం మనిద్దరి మధ్య పరస్పరం' అని సూత్రాలు వల్లించకు.

బయటకివచ్చి చెవిలో చెలికాడి సంగతులేమయ్యాయని ఆట పట్టిస్తోంది. నీలాకాశం నావైపు చూసి నవ్వటమే మానేసింది. అదీ నీ జట్టు కట్టాకే! పొడగపూలు పరిహాసంగా నన్నుచూసి ఒకటే నవ్వులు ..... చామంతి సన్నగా మూతి విరుపులు! ఎందుకు? మన ప్రణయాన్ని కథలు కథలుగా చెప్పలేదనా? ఎందుకు చెప్పాలి?

మధ్యరాత్రిలో కలలో నువ్వు కబుర్లు కవ్వింతలలో నవ్విస్తూంటే ఎగెరిగిరిపడి మెలకువ

వచ్చి చూస్తే నల్లని దివి మీద చెమ్కీల్లా మెరుస్తున్న తారలు నన్నుచూసి ఒకటే పకపకలు! ఇలలోనూ, కలలోనూ నీ జతగాడు అల్లరివాడేనా అని అడుగుతుంటే ఏమని జవాబు చెప్పను?